సాక్షి సంగారెడ్డి

సోమవారం । 2 । జూన్ । 2025



టీబీని తరిమికొడదాం

క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టింది. వివరాలు 8లో ▸



దొంగలు బాబోయ్.. దొంగలు

దుబ్బాకలో తరచూ వ్యవసాయబోర్లు అపహరణకు గురవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 8లో ▸



ఆహ్లాదం ఆవిరి..

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పార్కుల నిర్వాహణ అధ్వానంగా మారడంతో ప్రజలకు ఆహ్లాదం కరువైంది. వివరాలు 9లో ▸



సంగారెడ్డి మండలంలోని కలబ్ గూర్ మంజీరా డ్యామ్ గేట్లవద్ద ఈత కొడుతున్న యువకులు, చిన్నారులు

ఉల్లాసంగా..ఉత్సాహంగా

వేసవి సెలవుల్లో చిన్నారులు, పెద్దలు చక్కగా ఆస్వాదిస్తున్నారు. సంగారెడ్డి మండలంలోని కలబ్‌గూర్ మంజీరా డ్యాం వద్ద ఆదివారం ఈదులాడుతూ ఉల్లాసంగా గడిపారు. పెద్దలు సైతం నీళ్లలో కేరింతలు కొడుతూ సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. సంగారెడ్డి పట్టణానికి దగ్గరగా ఉండటంతో పట్టణ ప్రజలే కాకుండా పరిసర ప్రాంతాల వారు సైతం పిల్లలతో వచ్చి సెలవు దినాన్ని ఎంజాయ్ చేశారు. కేరింతలు కొడుతుండగా 'సాక్షి'క్లిక్ మనిపించింది.

సంగారెడ్డి టౌన్ :



సంగారెడ్డి శివారులో ఒకవైపు పచ్చగా మరోవైపు ఎండిపోయి కనిపిస్తున్న చెట్టు

చిగురింతల మోడు

సంగారెడ్డి శివారులో రోడ్డుపక్క పొలాల్లో ఉన్న ఈ చెట్టు వేసవికి మోడుగా మారిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ చెట్టు ఓ వైపు మళ్లీ కొత్త చిగుళ్లు వేయగా మరోవైపు మాత్రం మోడులాగే ఉంది. జీవితంలో కష్టాలు సాధారణం..వాటిని సహనంతో ఓర్చుకుంటేనే కాలం ఆ గాయాలను మాన్పుతుందని జీవిత పాఠం నేర్పుతోంది ఈ మాను. అటుగా వెళ్లే ప్రయాణికులకు జీవితానికి కష్టసుఖాలనేవి ఒకే నాణేనికున్న బొమ్మా బొరుసు లాంటివని ఈ చెట్టు చెబుతున్నట్టు లేదు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

న్యూస్‌రీల్

ప్రజావాణి వాయిదా

సంగారెడ్డి జోన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడింది. నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించే వేడుకల్లో అధికారులు పాల్గొంటుండటంతో వాయిదా వేసినట్లు కలెక్టర్ క్రాంతి ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలో ఈనెల 3 నుంచి 17 వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దారు రాజుపటేల్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 3న అబ్బెంద, బాణాపూర్, అల్లాపూర్ గ్రామాల్లో, 4న అనంతసాగర్, అంత్వార్, హుంగ్రానా(జి), 5న చాప్టా(కె), చందాపూర్, హంగర్గా(బి), 6న గంగాపూర్, పంచగామ, హంగర్గా(కె), 9న మాధ్వార్, మన్సూర్పూర్, జూకల్, 10న హన్మంతరావుపేట, పిప్రీ, కాంజీపూర్, 11న లింగాపూర్, సత్తెగామ, కొండాపూర్, 12న నిజ్లిమేట్, జుజాల్‌పూర్, నాగాపూర్, 13న సంజీవన్‌రావుపేట, జగన్నాథ్‌పూర్, నర్సాపూర్, 16న ర్యాకల్, చాంద్‌ఖాన్‌పల్లి, నారాయణఖేడ్, 17న వెంకటాపూర్, పైడిపల్లి, రుద్రారం గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు నలుగురు టీచర్లు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రాష్ట్ర స్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాల అభివృద్ధిలో వివిధ అభ్యసనా పద్ధతులు(బెస్ట్ ప్రాక్టీస్)లలో భాగంగా ఉత్తమ ప్రదర్శనకుగాను జిల్లా నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని డీఈఓ వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరిలో సదాశివపేట మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, అదేపాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సునీత, రామచంద్రపురం మండలంలోని తెల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్,న్యాల్కల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సఫియా సుల్తానాలు ఉన్నారు.

ఎమ్మెల్యే గూడెంకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో ఈ నెల 6న నిర్వహించ తలపెట్టిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అంబేడ్కర్ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...భవిష్యత్తు తరాలకు మహనీయుల ఆశయాలను అందించాలన్న లక్ష్యంతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు.

బడిబాట తర్వాతే సర్దుబాటు

పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య

జోగిపేట(అందోల్): తెలంగాణ ప్రభుత్వం జూన్ 6 నుంచి ప్రారంభించనున్న బడిబాట కార్యక్రమం పూర్తయ్యాకే పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య డిమాండ్ చేశారు. బడిబాట పూర్తి కాకముందే ప్రస్తుత డైస్ సంఖ్య ఆధారంగా జూన్ 13 లోపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసి ఉపాధ్యాయులను విద్యావ్యవస్థను అయోమయానికి గురిచేస్తోందని ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

వన మహోత్సవానికి వేళాయె

- ఈ ఏడాది 34.05లక్షల మొక్కలు నాటాలని నిర్ణయం
- వివిధ శాఖల సిబ్బందితో మొక్కలు నాటించనున్న అధికారులు
- ప్రత్యేక దృష్టి సాగిస్తున్న సిబ్బంది



నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు



సంగారెడ్డి టౌన్ : పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం 11 వ విడత వనమహోత్సవ కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనుంది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచేలా చర్యలు తీసుకుంది. ఈ నర్సరీల నిర్వహణకు సుమారు రూ3.42 కోట్లను ఖర్చు చేస్తున్నారు. అధికారులు ఇప్పటివరకు పది విడతలుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. 11వ విడతగా 34,05,850 మొక్కలను నాటాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటికే మొక్కలు పెంచుతూ, వాటిని సంరక్షిస్తున్నారు. ఎండలో మొక్కలు ఎండిపోకుండా నర్సరీల్లో గ్రీన్ షెడ్ నెట్లు ఏర్పాటు చేసి వాటిని రక్షించారు.

ఇవీ అందుబాటులో ఉన్న మొక్కలు

ఆయా పంచాయతీల లక్ష్యాలకు అనుగుణంగా అదే గ్రామంలోని నర్సరీలో మొక్కలు పెంచారు. ప్రధానంగా జామ, నిమ్మ, దానిమ్మ, ఈత, వేప, ఉసిరి, చింత, వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఈతవనాలను చెరువు కట్టలు, ఇతర ప్రదేశాల్లో నాటడానికి అబ్కారీశాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇక మిగతా మొక్కలను ఆసక్తి ఉన్న రైతులు పెంచుకోవచ్చు. కొన్ని పంచాయతీల్లో ఇతర మొక్కలు కూడా పెంచుతున్నారు. అక్కడి రైతుల ఆసక్తి మేరకు వాటి పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇక ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. మొక్కలను వివిధ శాఖల ఆధ్వర్యంలో నాటడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ మొక్కను నాటి దాని చుట్టూ కంచెవేసి వాటికి నీరు అందించి మొక్కను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రతీరోజు నీరు పోయడానికి వన సేవకులను నియమించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో మొక్కలను నాటడానికి ఏర్పాట్లను సిద్ధం చేశారు. వీటిని నాటడంతో పాటు రక్షించే బాధ్యతలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు తీసుకోనున్నారు. ప్రతీ ఇంటికి 6 మొక్కలను అందించి వాటిని రక్షించాల్సిన బాధ్యత కూడా సదరు యజమానులకు అప్పగించనున్నారు.

వివిధ శాఖలకు కేటాయించిన మొక్కలు	
దేవాదాయ	750
ఎక్సైజ్	2.75 లక్షలు
అటవీ	12 లక్షలు
ఉద్యాన	75 వేలు
పరిశ్రమలు	75 వేలు
ఎన్‌హెచ్‌ఏఐ/ఆర్ అండ్ బి	75 వేలు
నీటిపారుదల	18,750
హోమ్	3,750
విద్యా	750
సంక్షేమ	1000
పశుసంవర్ధక	750
జైళ్ల	750
మాతా శిశు సంక్షేమం	1,100
అర్బన్ ఏరియా	4,57,500

మొక్కలు సిద్ధం చేశాం



నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వేసవిలో ఎండలు అధికంగా ఉన్నప్పటికీ గ్రీన్‌షెడ్స్ వేసి సంరక్షించారు. కొన్ని చోట్ల మినహాయిస్తే ప్రతీచోట చక్కగా పెరిగాయి. త్వరలోనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

– మణికుమార్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్

అవతరణ వేడుకలకు సర్వం సిద్ధం

- విద్యుత్ దీపాల కాంతుల్లో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం



జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏర్పాట్లు

సంగారెడ్డి జోన్: రాష్ట్రవతరణవేడుకలకు జిల్లా కలెక్టరేట్‌తో పాటు ఎస్పీ కార్యాలయం సిద్ధమయ్యాయి. కలెక్టరేట్ కార్యాలయం రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎస్పీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవతరణ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. అదేవిధంగా కలెక్టర్ వల్లూరు క్రాంతితోపాటు ఎస్పీ పరితోశ్ పంకజ్ హాజరు కానున్నారు.



విద్యుత్ దీపాల కాంతుల్లో కలెక్టర్ కార్యాలయం

పత్రచిత్రంలో త్యాగఫలం



రావి ఆకుపై అమరవీరుల స్తూపం గీసిన గుండు శివకుమార్

నారాయణఖేడ్: ఎందరో వీరుల త్యాగఫలం, అలుపెరగని సబ్బండవర్గాల పోరాటాలకు దక్కిన ప్రతిఫలం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం . సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకులపై అమరవీరుల స్తూపం, వీరుల శక్తి ఐక్యత, నూతన తెలంగాణ తల్లి చిత్రాలను వేసి ఉద్యమకారులు, మేధావులు, పాత్రికేయులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, కవులు, కళాకారులు, సబ్బండ వర్గాలకు రాష్ట్రవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

చెట్ల నరికివేతకు అడ్డేది?

- అటవీ భూములను కబ్జా చేస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు




చెట్లను నరికి సాగుకు సిద్ధం చేసిన భూమి

జహీరాబాద్ టౌన్: అటవీ విస్తీర్ణం పెంచేందుకు ఒక పక్క మొక్కలు నాటుతుంటే మరో పక్క అక్రమార్కులు చెట్లను నరికివేస్తున్నారు. అటవీ భూములను కబ్జా చేసి వ్యవసాయ భూములుగా మార్చుతున్నారు. పర్యవేక్షించాల్సిన అటవీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో పచ్చని చెట్లు అంతరించిపోతున్నాయి. జహీరాబాద్ అటవీ డివిజన్ పరిధిలో జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్ మండలాల పరిధిలో అటవీ ప్రాంతం ఉంది. పలు రకాల చెట్లు ఉండగా అటవీ శివారులోని చెట్లను కొందరు నరికివేస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్ల అటవీ సంపద అంతరించిపోగా అటవీ భూమి కబ్జాకు గురవుతోంది. మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ గ్రామం వరకు అటవీ ప్రాంతం ఉంది. గ్రామ సమీపంలో ఉన్న చెట్లు, మొక్కలను అక్కమార్కులు తొలగించి చదును చేస్తున్నారు. అటవీ భూమి కబ్జాకు గురవుతున్న విషయాన్ని గ్రామానికి చెందిన వారు అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. బీట్ అధికారులున్న పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గౌసాబాద్‌తోపాటు పలు గిరిజన తండా పరిసర ప్రాంతాల్లోని అటవీ శాఖకు చెందిన చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో అటవీ భూమిని పోడు పేరుతో వ్యవసాయ భూమిగా మార్చుకుని పంటలను సాగుచేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి పచ్చని చెట్లు అంతరించిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించటమే లక్ష్యం

- గ్రామస్థాయిలో విత్తన తయారీ
- నేడు ప్రారంభించనున్న మంత్రి దామోదర



సంగారెడ్డి జోన్: గ్రామాలలో పంటలు సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ కలిసి ప్రతి రైతుకు నాణ్యతతో కూడిన విత్తనాలు అందించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. రైతులే స్వయంగా గ్రామస్థాయిలో విత్తనం తయారీ చేసుకుని తోటి రైతులకు సరాఫరా చేసే విత్తన ఉత్పత్తి కార్యక్రమాన్ని సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ వెల్లడించారు.

ముగ్గురు రైతులు ఎంపిక

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధ్వర్యంలో ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా ప్రతీ రెవెన్యూ గ్రామం నుంచి ముగ్గురు రైతులను ఎంపిక చేసి వారికి సన్న గింజ రకం వరి, కంది, పెసర పంట రకాల విత్తనాలు అందిస్తారు. గ్రామస్థాయిలో విత్తన ఉత్పత్తి కార్యక్రమం జరుగుతుంది. పంట సాగు కాలంలో శాస్త్రవేత్తలు ఎంపిక చేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పలు సలాహా సూచనలు అందజేయనున్నారు.

మండలానికో శాస్త్రవేత్త

విత్తనోత్పత్తి కార్యక్రమ పర్యవేక్షణ కోసం పలువురు అధికారులతో పాటు శాస్త్రవేత్తలను నియమించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి జిల్లా నోడల్ అధికారిగా డాక్టర్ బి.బాలాజీ నాయక్ నియమితులయ్యారు. అదేవిధంగా ప్రతీ మండలానికి ఒక శాస్త్రవేత్తను కేటాయించారు.

పంట మార్పిడి ఏదీ?

- పదేళ్లుగా పడిపోతున్న ఆరుతడి
- మూసపద్ధతులతో దెబ్బతింటున్న భూసారం



సాగులో ఉన్న కంది, మినుము పంట

నారాయణఖేడ్: ఆరుతడి పంటలు ఆదరణ కోల్పోతున్నాయి. రైతులందరూ వాణిజ్య పంటల సాగు వైపే మొగ్గు చూపిస్తుండటంతో భూమి నిస్సారంగా మారే అవకాశముందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పంట మార్పిడి పాటిస్తూ భూసారం దెబ్బతినకుండా కాపాడుకుంటూ పంట సాగు జరగాల్సి ఉండగా జిల్లాలో అందుకు విరుద్ధంగా వ్యవసాయ పనులు సాగుతున్నాయి. ప్రభుత్వం పంటమార్పిడి గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన ఫలితాలు రావడంలేదు. దీంతో వ్యవసాయ పరంగా పలు ఇబ్బందులు ఏర్పడే అవకాశముందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రతీ ఏటా వ్యవసాయ శాఖ ఆ ఏడాది జిల్లాలో సాగయ్యే పంటలపై ముందస్తుగా పంటల ప్రణాళికను ఖరారు చేస్తుంది. ఈసారి కూడా మూసపద్ధతిలో గతంలో సాగుచేసిన పంటలే ఈ సారి కూడా పెరగడం, తగ్గుముఖం పట్టిన పంటల సాగు మరింత తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా జిల్లాలో పదేళ్లక్రితం వరకు ఆరుతడి పంటల సాగు భారీ స్థాయిలో జరిగేది. కానీ, ప్రసుత్తం ఆ పరిస్థితి కనిపించడంలేదు. కేవలం వాణిజ్య పంట సాగే అధికంగా ఉంటుంది.

అత్యధికంగా పత్తి...

రైతులు వాణిజ్య పంటల ఉత్పత్తిని గణనీయంగా పెంచేశారు. మార్కెట్‌లో మంచి ధర ఉండటం, దిగుబడులు కూడా బాగా ఉండటంతో రైతులు ఆ పంటలవైపు మళ్లుతున్నారు. ఇందులో ముఖ్యంగా పత్తిపంట నిలుస్తోంది. జిల్లాలో అత్యధికంగా పత్తి పంట ఈ ఏడాది 1,43,817.81 హెక్టార్లలో సాగు జరగనుందని అంచనా వేశారు. ఈ పంటనే జిల్లాలో మొదటి స్థానంలో నిలవనుంది. రెండో స్థానంలో వరి పంట 59,424.7 హెక్టార్లలో సాగయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ఈ రెండు పంటలు ప్రతీ ఏటా భారీ స్థాయిలోనే సాగుతున్నాయి.

ఆరుతడి తగ్గుముఖం

పదేళ్లకు పూర్వం జిల్లాలో ఆరుతడి, పప్పుదినుసుల పంటలు భారీస్థాయిలో సాగు జరిగేది. కానీ ఇవి తగ్గుముఖం పడుతున్నాయి. జొన్న 237.25 హెక్టార్లు, మొక్కజొన్న 3,441.3, పెసర 5,749.39, కంది, 32,044.53, మినుము 3,465.59, సోయాబిన్ 29,817.81, రాగులు 5.26, సామలు 0.3, స్వీట్‌కార్న్ 37.65, ఆముదాలు 5.67, వేరుశెనగ 2.02, బొబ్బర్లు 3.24, ఉలవలు 2.43, ఉద్యావన పంటలు 9,898.79 హెక్టార్లలో సాగు జరగనున్నట్లు అంచనా వేశారు. గత ఐదారేళ్లుగా ఈ పంటల సాగు ఇలాగే ఉంటూ వస్తోంది.

పంట మార్పిడి లేకపోతే నష్టమే

పంటమార్పిడిని కచ్చితంగా చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. వాణిజ్య పంట అయిన పత్తి పంటకు మద్దతు ధరకంటే బయటి మార్కెట్‌లో అత్యధికంగా ధర పలకడం, దిగుబడులు కూడా బాగానే ఉండటంతో ఈ పంటపై మక్కువ చూపుతున్నారు. ఆరుతడి పంటల దిగుబడులు తగ్గడం కూడా ఈ పంట పెరిగేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. పెసర, మినుము పంటలు 70రోజుల్లో కోతకు రాగా అదే సమయంలో భారీ వర్షాలు ఉంటాయి. కోత సమయంలో వర్షాలు వచ్చిన పక్షంలో పంట దెబ్బతింటోంది. దీంతో పంట మార్పిడి చేసేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. పంట మార్పిడి లేకపోవడం వల్ల భూసారం దెబ్బతినే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

3 నుంచి విత్తనాల పంపిణీ

ప్రభుత్వం ప్రతీ గ్రామంలో ఉత్తమ రైతులను ఎంపిక చేసి యూనివర్సిటీ నుంచి తెప్పించిన పప్పుదినుసులైన కంది, మినుము, పెసర పంటల మేలు రకం విత్తనాలు ఇచ్చి సాగు చేయించి ఉత్పత్తి అయిన పంటను సేకరించి విత్తనంగా మారుస్తారు. దీన్నే సదరు గ్రామంలోని రైతులకు విక్రయించి పప్పుదినుసుల సాగును ప్రోత్సహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 3 నుంచి విత్తనాల పంపిణీ చేపట్టనున్నారు.



పూతకొచ్చిన కంది పంట

క్లుప్తంగా

నాసిరకంగా జాతీయ రహదారి పనులు

మూడు నెలలకే పగుళ్లు



రోడ్డుపై పగుళ్లు

కోహెడరూరల్(హుస్నాబాద్): సిద్దిపేట నుంచి హన్మకొండ జాతీయ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లోపం బయట పడుతుంది. మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో పలు చోట్ల బీటీ రోడ్డుకు పగుళ్లు, గుంతలు ఏర్పడ్డాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న రోడ్లు మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. కాంట్రాక్టర్ త్వరగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో నాణ్యతను పట్టించుకోకుండా హడావిడిగా రోడ్డు విస్తరణ పనులు చేసేసి చేతులు దులుపుకున్నట్లు గ్రామస్తులు, వాహనదారులు విమర్శిస్తున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ఫోన్‌ను అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

హుస్నాబాద్: హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో ఆదివారం చెంచు లక్ష్మణ్ అనే వ్యక్తి సిద్దిపేట నుంచి సముద్రాల వరకు ప్రయాణించాడు. లక్ష్మణ్ రూ.20 వేలు విలువ చేసే సెల్ ఫోన్‌ను బస్‌లో మరిచిపోయాడు. ఆ సెల్ ఫోన్‌ను తీసుకున్న కండక్టర్ తిరుపతి కంట్రోలర్‌కు అప్పగించాడు. ఫోన్‌ను ఆర్టీసీ సిబ్బంది తిరిగి ప్రయాణికుడు లక్ష్మణ్‌కు అప్పగించారు.

ఇద్దరు అదృశ్యం

డ్యూటీకి వెళ్తున్నానని యువతి

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్రకు చెందిన వైశాలీ(24) కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలో ఉంటుంది. ఓ ప్రైవేట్ స్కూల్ బస్సులో అటెండర్‌గా పని చేస్తుంది. శనివారం డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తల్లి మహానంద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బంధువుల ఇంటికెళ్తున్నానని బాలిక

బంధువుల ఇంటికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి బాలిక అదృశ్యమైంది. అమీన్‌పూర్ పోలీసుల కథనం మేరకు... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక శనివారం బంజారాహిల్స్‌లో ఉండే తమ బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించలేదు. బాలిక అదృశ్యంపై ఆదివారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టీబీని తరిమికొడదాం..

క్షయ వ్యాధి నిర్మూలనకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం

- గ్రామాల్లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం
- ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్షయ(టీబీ) నిర్మూలించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా ప్రజల నుంచి సరైన స్పందన రావడం లేదు. గ్రామ స్థాయిలో వ్యాధులను గుర్తించేందుకు సౌకర్యాలు లేకపోవడంతో పరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో వ్యాధి రోజు రోజుకూ వ్యాప్తి చెందుతుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. – న్యాల్‌కల్(జహీరాబాద్)



న్యాల్‌కల్ పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది



చాల్కిలో ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఆశా వర్కర్

2025 నాటికల్లా టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా గత నెల 28న జిల్లాలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో 743 గ్రామాలు, 2,98,000 కుటుంబాలు ఉన్నాయి. ముందుగా పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్లను ఎంపిక చేసిన అధికారులు వాటి పరిధిలోని గ్రామాల్లో టీబీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. శిక్షణ పొందిన వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరుగుతూ దగ్గు, జ్వరం, బీపీ, షుగర్, తెమడలో రక్తం రావడం, రాత్రి పూట చెమటలు పట్టడం, మద్యం సేవించేవారు, ఛాతిలో నొప్పి ఉన్న వారితోపాటు ప్రస్తుతం టీబీ మందులు వాడుతున్న వారి కుటుంబ సభ్యులు, గతంలో వ్యాధి సోకిన వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. సేకరించిన సమాచారం ప్రకారం వారికి తెమడ, పరీక్షలు, రక్త పరీక్షలు గ్రామాల్లోనే నిర్వహిస్తున్నారు. స్థానికంగా సౌకర్యాలు లేని గ్రామాల్లో పరీక్షలు చేసేందుకు ప్రత్యేక వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు. గ్రామాలకు వచ్చే వాహనంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు.

10,636 మందికి టీబీ పరీక్షలు

జిల్లాలో గతేడాది 2,100 మంది టీబీ వ్యాధి బారిన పడగా, ఈ ఏడాది జనవరి నుంచి మే నెలాఖరు వరకు 10,636 మందికి టీబీ పరీక్షలు నిర్వహించగా అందులో 909 మంది వ్యాధి బారిన పడినట్లు అధికారులు గుర్తించారు. వ్యాధి సోకిన వారికి మందులను కూడా అందిస్తున్నారు. ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాధి సోకుతుందని, వ్యాధి సోకిన వారు పరీక్షలు చేసుకునేందుకు ముందుకు రాకపోవడం వల్ల ఈ వ్యాధి కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వాళ్లకు సోకుతుందని అధికారులు పేర్కొంటున్నారు. వ్యాధి సోకిన వారు మందులు సరిగ్గా వాడక పోవడం వల్ల మృత్యువాత పడుతున్నారని తెలిపారు.

సత్ఫలితాలు ఇవ్వడంతో..

టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొన్ని జిల్లాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయా జిల్లాలో 100 రోజుల కార్యక్రమాన్ని చేపట్టింది. టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి స్కానింగ్, వైద్య పరీక్షలు నిర్వహించింది. ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సత్ఫలితాలు ఇవ్వడంతో అన్ని జిల్లాల్లో ఇదే తరహా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. 100 రోజులు కాకుండా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

విస్తృత ప్రచారం



వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. టీబీ వ్యాధి లక్షణాలు ఉన్న వారితో పాటు జ్వరం, బీపీ, నీరసం, రాత్రి పూట చెమటలు పట్టడం లాంటి లక్షణాలు ఉన్న వారికి కూడా పరీక్షలు చేస్తున్నాం. వారికి ఉచిత పరీక్షలు చేయడంతోపాటు మందులను అందిస్తున్నాం.

–అరుణ కుమారి, జిల్లా టీబీ అధికారి

టీబీ నిర్మూలన కోసం



జిల్లాలో టీబీని పూర్తిగా నిర్మూలించి టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మే 28 నుంచి టీబీ పరీక్షలు, స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరుగుతూ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు చేయించే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది.

– గాయత్రీ దేవి, జిల్లా వైద్యాధికారి



కరపత్రం విడుదల చేస్తున్న డీసీపీ మధుకర్ స్వామి, అధికారులు

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

డీసీపీ మధుకర్ స్వామి

దుబ్బాకటౌన్ : యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డీసీపీ మధుకర్ స్వామి, ప్రొఫెసర్ కే.హుస్సేన్ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి ఎస్‌ఐ తౌడ సత్యనారాయణ ఆధ్వర్యంలో దుబ్బాకలో అఖిలా రాజ్ ఫౌండేషన్ ఆవిర్భావ సభలో కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. మారుతున్న టెక్నాలజీకి అనుకూలంగా యువత మారాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ సేవను యువత సామాజిక బాధ్యతగా భావించాలని, అప్పుడే సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. అఖిలా రాజ్ ఫౌండేషన్ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వర్తించి సమాజంలో తనదైన పాత్రను పోషించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్‌ఐ తౌడ సత్యనారాయణ మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన పరిస్థితుల ప్రభావం తనపై అపారంగా ఉందని, చిన్నతనంలో ఎదుర్కొన్న కష్టాలు మరెవరూ ఎదుర్కోవద్దని భావించి ఈ సంస్థను స్థాపించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద విద్యార్థులకు చేయూత ఇవ్వడమే ఈ సంస్థ ప్రధాన ఆశయమని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్ భాగ్య కిరణ్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జక్కుల వెంకట్, ఓయూ నాయకులు శ్రీకాంత్, నాయకులు శివకుమార్, వర్తక సంగం నాయకులు రాజు, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న డీబీఎఫ్ సభ్యులు

నిజాంపేట(మెదక్): గురుకుల విద్యార్థులు బాత్ రూమ్‌లు కడగాలని, తరగతి గదులు శుభ్రం చేసుకోవాలని అవమానపరిచిన గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని తక్షణమే సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. నిజాంపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను కులం పేరుతో అవమానపర్చడమే కాకుండా బానిసల కంటే హీనంగా అవమానపర్చడం తగదన్నారు. తన క్లీనింగ్ ఆదేశాలను ప్రశ్నించే తల్లిదండ్రులు, పిల్లలపై చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేయడం సిగ్గు చేటన్నారు. తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజాంపేట మాజీ ఉప సర్పంచ్ కొమ్మట బాబు, డీబీఎఫ్ మండల అధ్యక్షుడు బ్యాగరీ చంద్రం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్, బ్యాగరి రాజు, ఎండీ యాదుల్, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై నుంచి లారీ బోల్తా

ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



డ్రైవర్ రమేశ్ మృతదేహం



ధ్వంసమైన లారీ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బైపాస్ రోడ్డులో పస్తాపూర్ వద్ద హైవే బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ కాశీనాథ్ కథనం మేరకు.. ఐరన్ స్క్రాప్ లోడ్‌తో హైదరాబాద్ నుంచి బీదర్ వైపు వెళ్తున్న లారీ బైపాస్ రోడ్డులో పస్తాపూర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి సర్వీస్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వైఎస్ఆర్ కడప జిల్లా లింగాల గ్రామానికి చెందిన రమేశ్(45) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్ సత్యసాయి జిల్లా నాగసముద్రంకు చెందిన పాముల వీరేశానికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా : ఒకరికి గాయాలు

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల ప్రధాన రహదారిపై ఆటో బోల్తా పడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన వ్యక్తి ట్రాలీ ఆటో రిపేర్ కోసం వెళ్తుండగా ఆదివారం సాయంత్రం కొత్త బస్టాండ్ సమీపంలో అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నచ్చిన కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగదేవ్‌పూర్ మండలంలో ఘటన



జానీ (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): నచ్చిన కారు తండ్రి కొనివ్వడం లేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్, స్థానికుల కథనం మేరకు.. చాట్లపల్లి గ్రామానికి చెందిన బొమ్మ కనకయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడికి వివాహం కాగా చిన్న కుమారుడు జానీ(21)కి వివాహం కాలేదు. గ్రామంలో ఉంటూ వ్యవసాయం చేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి జానీ తండ్రిని బీఎండబ్ల్యూ కారు కొనియాలని, లేకపోతే చనిపోతానని తరచూ గొడవ పడుతున్నాడు. మన ఆర్థిక పరిస్థితి సరిగా లేదని సముదాయించారు. అయినా జానీ ప్రవర్తనలో మార్పు రాలేదు. 30న సిద్దిపేటలో కారు షోరూమ్‌కు వెళ్లి మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారును చూశారు. మారుతీ కారు తనకు వద్దని బీఎండబ్ల్యూ కారే కావాలని పట్టుబట్టి మనస్తాపానికి గురయ్యాడు. అదే రోజు సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద పురుగు మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఎంఎస్‌కు అండగా ఉంటాం

సంగారెడ్డి: సంగారెడ్డి డివిజన్‌లో నూతనంగా ఆవిర్భవించిన భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్‌కు భారతీయ మజ్దూర్ సంఘ్ అండగా ఉంటుందని బీఎంఎస్ తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ జె.రామ్ మోహన్ పేర్కొన్నారు. సంగారెడ్డి ముదిరాజ్ భవనంలో ఆదివారం నిర్వహించిన భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ సంగారెడ్డి డివిజన్ మొదటి జాయింట్ డివిజనల్ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. పోస్టల్ యూనియన్ చేపట్టే అన్ని పోరాటాలకు బీఎంఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సంగారెడ్డి డివిజన్ భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ పీ 3 గ్రూప్ సీ ప్రెసిడెంట్‌గా శశిధర్, సెక్రెటరీగా పరమేశ్వర్, ట్రెజరర్‌గా మనీశ్, ఎంటీఎస్ సంగారెడ్డి డివిజన్ ప్రెసిడెంట్‌గా మోహన్, సెక్రెటరీగా రాములు, ట్రెజరర్‌గా మోహన్ దాస్ ఎన్నికయ్యారు. అదేవిధంగా భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘ్ సంగారెడ్డి డివిజన్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రెటరీగా రాజేంద్రకుమార్, ట్రెజరర్‌గా రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇంక్రిమెంట్ వేయకపోవడం కక్షపూరితం

క్యాంపులో అధ్యాపకుల నిరసన



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ వేయడంతో ప్రిన్సిపాల్స్ వివక్ష చూపుతున్నారని గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్ర అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల(కో ఎడ్యుకేషన్)లో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్స్, అధికారుల మొండి వైఖరి నశించాలి, అధ్యాపకుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినదించారు. అనంతరం కనకచంద్రం మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రెగ్యులరైన అధ్యాపకులకు మే నెలతో రెండేళ్లు పూర్తయ్యాయన్నారు. మొదటి సంవత్సరం ఇంక్రిమెంట్ చేసిన ప్రిన్సిపాల్స్ రెండో సంవత్సరం కావాలనే కొంతమంది తప్పుడు సూచనలతో నిలిపివేయడం దారుణమన్నారు. పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ మే నెల వేతనం సైతం వేయలేదన్నారు. కేవలం కాంట్రాక్టు నుంచి రెగ్యులర్ అయిన అధ్యాపకులకు మాత్రమే కుంటిసాకులు చూపుతూ ఇంక్రిమెంట్ వేయకుండా వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గిరి రవి, ప్రధానకార్యదర్శి ధరిపల్లి నగేశ్, కోశాధికారి దుబ్బాక రాజు, మహిళా కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర నాయకురాలు వనజ, గిరధర్, మెదక్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సురేందర్‌రెడ్డి, జిల్లా, రాష్ట్ర బాధ్యులతోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

- మరొకరికి స్వల్ప గాయాలు
- లారీని ఢీకొట్టిన కారు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన తిమ్మారెడ్డిపల్లి శివారులో గల కొమురవెల్లి కమాన్ వద్ద చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. కరీంనగర్ పట్టణానికి కదారి రవి (58) ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అతడి స్నేహితుడు గుంపుల రాజ్‌కుమార్ విద్యుత్‌శాఖలో పని చేస్తున్నాడు. రవికి హైదరాబాద్‌లో స్పోర్ట్స్‌కు సంబంధించిన మీటింగ్ ఉండటంతో కారులో స్నేహితుడు రాజ్‌కుమార్‌తో కలిసి ఆదివారం కరీంనగర్ నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో తిమ్మారెడ్డిపల్లి శివారులో గల కొమురవెల్లి కమాన్ వద్ద రాగానే కారు అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికి తీవ్ర, రాజ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొంతుతూ రవి మృతి చెందాడు. మృతుని భార్య లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో గిరిజన యువకుడు



మోహన్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): విద్యుదాఘాతంతో గిరిజన యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లి తండాలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం మేరకు.. తండాకు చెందిన ధరావత్ మోహన్ (42)హిందీ పండిట్ ట్రైనింగ్ పూర్తి చేసి డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. కొత్తగా కట్టిన బాత్ రూమ్ గోడలు క్యూరింగ్ చేసే క్రమంలో సింగిల్ ఫేజ్ మోటార్‌ను ఆన్ చేశాడు. మోటార్‌కు విద్యుత్ సరఫరా అవుతుండటంతో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీలకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానం పెనుభూతమై..

- భార్య తలపై పారతో భర్త దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కొండపాక(గజ్వేల్): భర్త దాడిలో భార్య మృతి చెందిన ఘటన కొండపాకలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. కొండపాక గ్రామానికి చెందిన పొన్నాల మల్లేశం భార్య యశోద(45)పై అనుమానంతో నిత్యం కొడుతుండేవాడు. ఈ క్రమంలో యశోద కుటుంబీకులు, గ్రామస్తులు పెద్దల పంచాయితీ పెట్టి దంపతులకు సర్ది చెప్పారు. కొద్ది రోజులు సంసారం సాఫీగా నడిచింది. వారం రోజుల కిందట మల్లేశం భార్యతో గొడవపడి ఇంట్లో చెప్పకుండా హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం ఇంటికొచ్చి మళ్లీ గొడవపడ్డాడు. ఒక్కసారిగా ఆవేశానికి గురై పారతో భార్య తలపై కొట్టగా స్పృహ తప్పి పడిపోయింది. కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి అన్న యాదగిరి ఫిర్యాదు మేరకు మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగలు.. బాబోయ్ దొంగలు

- విచ్చలవిడిగా బోర్ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ
- ఆందోళన చెందుతున్న రైతులు



దుబ్బాకలో చోరీకి గురైన వ్యవసాయ బోరు మోటార్



ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు

దుబ్బాక : వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ వైర్ల చోరీలు పెరిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్ని నెలలుగా దుబ్బాక పట్టణంతోపాటు మున్సిపాల్టీ పరిధిలోని చేర్వాపూర్, చీకోడ్ రోడ్డు, దుంపలపల్లి రోడ్డులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతంలో వ్యవసాయబోరు మోటార్ల కేబుల్ వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసుకొని ఎత్తుకెళ్లారు. పదుల సంఖ్యలో రైతుల మోటార్ల నుంచి కేబుల్ వైర్లు ఎత్తుకెళ్తుండటంతో రైతులకు ఇబ్బందిగా తయారైంది. మళ్లీ బోరు మోటార్ పైకి తీయడం, కొత్త కేబుల్ వైర్ వేయాల్సి వస్తుండటంతో ఒక్కో రైతుకు రూ.4 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు అవుతుండడంతో రైతులకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దొంగతనాలపై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేబుల్ వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను పట్టుకొని చోరీలు అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

రేబర్తిలో కాపర్ వైర్ చోరీ

మద్దూరు(హుస్నాబాద్): ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీకి గురైన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన బెల్లపు యాదయ్య వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి అందులోని కాపర్ వైర్ చోరీ చేశారు. ఆదివారం ఉదయం రైతులు పొలం వద్దకు వెళ్లి చూసే సరికి ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి ఉండటంతో విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కొద్ది రోజులుగా మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అంగన్ వాడీ కేంద్రంలో చోరీ

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాలలో గల అంగన్‌వాడీ కేంద్రం లోంచి గ్యాస్ సిలిండర్‌తోపాటు వంట సామగ్రి, వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. అంగన్‌వాడీ టీచరు శనివారం సాయంత్రం కేంద్రానికి తాళం వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం పాఠశాలల ఆవరణలో యువకులు ఆటలు ఆడుకునేందుకు వెళ్లగా తాళం పగులగొట్టి ఉండటాన్ని చూసి గ్రామస్తులకు, అంగన్‌వాడీ టీచరుకు సమాచారం అందించారు. టీచరు సంధ్య వెళ్లి చూడగా కేంద్రంలోంచి గ్యాస్ సిలిండర్, వంట సామాగ్రిలు, గుడ్లు, పప్పులు, ఉప్పులు తదితర వస్తువులను దొంగలు చోరీ చేసినట్లు గుర్తించారు. టీచర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.